www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 24 జనవరి 2023 5

ఏలూరు

1930కు సైబర్ నేరాల సమాచారమివ్వండి

ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ

ఏలూరు స్పోర్ట్స్: సైబర్ నేరాల బాధితులు టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని, వెంటనే దర్యాప్తు చేసి న్యాయం చేసేందుకు కృషి చేస్తామని ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ అన్నారు. జిల్లాలో నేరగాళ్లపై నిఘా మరింత పెంచామని, నేరాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. ఏలూరులోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎస్‌పికి వివరించారు. ఆయా సమస్యలపై సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్లు చేసి పరిష్కారానికి ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రజలు నేరగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడే వ్యక్తుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. సైబర్ నేరగాళ్ల మాయమాటలు చెప్పి మోసానికి పాల్పడతారని, వారి మోసపు మాటలకు లొంగిపోవొద్దని హితవుపలికారు.

108 ఉద్యోగులకు భద్రత ఏదీ..!

సిఎం ఇచ్చిన హామీ నేటికీ నెరవేరని దుస్థితి
12 గంటల పని విధానంతో తీవ్ర ఇబ్బందులు
చిన్నచిన్న కారణాలతో ఉద్యోగులపై వేటు
ఉద్యోగులు మృతి చెందిన పట్టని పరిస్థితి
సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధమంటూ సిబ్బంది హెచ్చరిక

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'కష్టం వస్తే క్షణాల్లో వాలిపోతారు. ఆపదలో ఉన్న వ్యక్తిని రక్షించేందుకు తమ సర్వశక్తులూ ఒడ్డుతారు. రాత్రీ పగలు తేడా లేకుండా విధులు నిర్వహిస్తారు. ఆపద సమయంలో అందరికీ అండగా ఉండే 108 ఉద్యోగుల బతుకులకు మాత్రం భద్రత లేకుండాపోయింది. మిమ్మల్ని ఆదుకుంటామని సిఎం ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరలేదు. ఎనిమిది గంటల పని విధానం అమలు చేయకపోవడం, చిన్నచిన్న కారణాలకే ఉద్యోగం నుంచి తొలగింపు వంటి అనేక సమస్యలతో 108 అంబులెన్స్ ఉద్యోగులు సతమతమవుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే సమ్మెకైనా సిద్ధమని ఉద్యోగులు హెచ్చరిస్తున్నారు.'

ఆపద వస్తే ఆగమేఘాల మీద మన వద్దకు వచ్చే 108 అంబులెన్స్ గురించి అందరికీ తెలిసిందే. అయితే ఆ 108 వాహనాల్లో విధులు నిర్వహించే ఉద్యోగుల కష్టాల గురించి ఎంత చెప్పినా తక్కువే. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 50 వరకూ 108 వాహనాలు సేవలందిస్తున్నాయి. ఈ వాహనాల్లో 120 మంది పైలెట్ (డ్రైవర్లు), 130 మంది ఇఎంటి (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌లు) మొత్తం 250 మంది పని చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సంఖ్య వేలల్లో ఉంది. ప్రతిరోజూ ఎంతోమంది ప్రజల ప్రాణాలను కాపాడుతుంటారు అంబులెన్స్ ఉద్యోగుల పాత్ర ఎనలేనిది. అత్యవసర విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం కనికరం లేకుండాపోయింది. 108 ఉద్యోగులకు భద్రత కల్పిస్తామని సిఎం జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకొచ్చి మూడున్నరేళ్లు గడిచినా ఇప్పటికీ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఇప్పటికీ అంబులెన్స్ ఉద్యోగులంతా ఏజెన్సీ పరిధిలోనే పని చేస్తున్నారు. నేరుగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నా పట్టించుకోని పరిస్థితి ఉంది. నిబంధనల ప్రకారం ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాల్సి ఉంది. ఇప్పటికీ 108 ఉద్యోగులకు 12 గంటల పని విధానం అమలవుతోంది. ఒక్కోసారి 14 గంటలు సైతం పని చేయాల్సి వస్తోంది. దీంతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఏదైనా కారణంతో 108 వాహనం ప్రమాదానికి గురైతే విధుల నుంచి తొలగించడం వంటి చర్యలు చేపడుతూ మరిన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఉద్యోగులు చెబుతున్నారు. ఒకవేళ సస్పెన్షన్ చేస్తే ఎన్ని రోజులు అనేదీ చెప్పని పరిస్థితులు ఉన్నాయి. సస్పెన్షన్ కాలంలో కార్మిక చట్టాలకు అనుగుణంగా వేతనాలు కూడా అమలు చేయకపోవడం అత్యంత దారుణమని చెప్పొచ్చు. 108 ఉద్యోగులు మరణిస్తే ఉద్యోగి కుటుంబాన్ని నడిరోడ్డుపై వదిలేస్తున్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం నుంచి సరైన చర్యలు తీసుకోకపోవడం ఉద్యోగులను తీవ్రంగా కలిచివేస్తోంది. అంబులెన్స్ ఉద్యోగులకు ప్రతియేటా వేతన పెంపును అమలు చేయాలని ఉద్యోగులు కోరుతున్నా ఎటువంటి చర్యలూ లేకుండాపోయాయి. వాహనాలు సరైన కండీషన్‌లో లేకపోవడంతో ఒక్కోసారి సమయానికి వెళ్లలేని పరిస్థితులు నెలకొనడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు కండీషన్‌లో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రభుత్వ నియామకాల్లో విద్యార్హత, ప్రమాణాలు కలిగిన 108 ఉద్యోగులకు సర్వీస్‌ను బట్టి వెయిటేజీ మార్కులు అందించాలని సైతం వారంతా కోరుతున్నారు. అంబులెన్స్ ఉద్యోగులుగా 17 ఏళ్లుగా పని చేస్తున్నా ఉద్యోగ భద్రత లేకపోవడంతో వారంతా తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. అందరికీ ఆపదలో అండగా నిలిచే 108 ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది.

సమస్యలు తీర్చకుంటే సమ్మెకైనా సిద్ధం

తాము ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చాలని సోమవారం 108 ఉద్యోగులు జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. సమస్యలు పరిష్కరించకపోతే ఏ క్షణంలోనైనా సమ్మెకు సిద్ధమని అంబులెన్స్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా 108 ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టిసారిస్తే బాగుంటుందని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మృత్యుంజయరావు, నేత ఎన్.దినేష్, జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు రమేష్, శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ఏలూరులో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న 108 ఉద్యోగులు

బుట్టాయగూడెంలో..

1/70ని సంరక్షించండి

ఏజెన్సీ మండలాల్లో ధర్నాలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏజెన్సీ గిరిజన చట్టాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని, గిరిజనుల సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని, ప్రభుత్వ భూములను అక్రమంగా అనుభవిస్తున్న గిరిజనేతరులపై చర్యలు తీసుకోవాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ ధర్నానుద్దేశించి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ నేడు 1/70 చట్టాన్ని రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన సురెడ్డి రమణారెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడాన్ని గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఏళ్ల తరబడి చేసిన ఉద్యమాల ఫలితంగా గిరిజన ప్రాంతంలో కొన్ని చట్టాలు వచ్చాయని, ఆ చట్టాలు తెలియని వారే భూమి, ఉద్యోగ ఖనిజ సంపదను దోచుకోవడం కోసం 1/70 చట్టాలను రద్దు చేసే వారి మనుగడకు ముప్పు వాటిల్లుతుందన్నారు. 1/70 చట్టం ప్రకారం అన్యాక్రాంతమైన భూములను గిరిజనులకు అప్పగించాలన్నారు. ఈ ధర్నాకు గిరిజన సంఘం మండల అధ్యక్షులు కారం భాస్కర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి పోలోజు నాగేశ్వర్రావు, చోడెం దుర్గ, మొడియం నాగమణి, తామ ముత్యాలమ్మ, కొరసా జలపాలు, తెల్లం మునీశ్వర్‌రావు, కొవ్వాసి దుర్గారావు, చోడెం పోతయ్య నాగమణి పాల్గొన్నారు.



జీలుగుమిల్లిలో..

జీలుగుమిల్లి : 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తెల్లం దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ఎలీషాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, సిఐటియు నాయకులు కొండలరావు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిషోర్, గిరిజన సంఘం నాయకులు సరిపల్లి అప్పారావు పాల్గొన్నారు.



వేలేరుపాడులో..

చట్టం ఆటంకంగా ఉందని దీనిని రద్దు చేయాలని పిటిషన్ దాఖలు చేశారన్నారు. ఇప్పటికే గిరిజన సంఘం (టిఏసి) తీర్మానం ప్రకారంగా సుప్రీంకోర్టులో దాఖలైన జిఒ-3పై రివ్యూ పిటిషన్ నేటికీ విచారణ పూర్తి చేయలేదన్నారు. ఐదో షెడ్యూల్ క్లాజ్-2 ప్రకారంగా చట్టబద్ధత కల్పిస్తామని టిఎసిలో తీర్మానం చేసి న్యాయసలహా పేరుతో అడ్వకేట్ జనరల్ అభిప్రాయాన్ని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసి రెండేళ్లు అవుతున్నా ప్రభుత్వం చొరవ చూపించకపోవడంతో గిరిజన ప్రాంతంలో గిరిజన యువతీయువకులకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో కొంత భూమిని కోల్పోయిన ఏజెన్సీ ప్రాంతం జల్లేరు, అభయారణ్యం, ఆయుధాల కర్మాగారంతో మరికొంత భూమిని కోల్పోతున్నారని, ఆదివాసీలకు ఉన్న కొద్దిపాటి

వేలేరుపాడు : స్వార్థపూరిత కుట్రతో గిరిజన హక్కులను, సాంప్రదాయాలను, ఆర్థిక మూలాలను దెబ్బతీసే విధంగా 1/70 చట్టాన్ని రద్దు చేయాలనే ప్రయత్నాలను తిప్పికొట్టాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్ పిలుపునిచ్చారు. తెలంగాణకు చెందిన ఎస్.రమణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అఫిడవిట్ దాఖలు చేసి, సుప్రీంకోర్టులో గిరిజనుల హక్కులను కాపాడాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్ డిమాండ్ చేశారు. మండలంలోని వసంతవాడలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మడివి, దుర్గారావు, పూసం రాంబాబు, మడకం, ఏసుబాబు, కారం సీతయ్య, చంద్రరావు, బుచ్చయ్య, పాపయ్య అక్కమ్మ, నాగమ్మ ఉన్నారు.

నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు

కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ విమర్శించారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల నారాయణ విద్యాసంస్థలు జంగారెడ్డిగూడెం, తణుకు ప్రాంతాల నుండి అధ్యాపకులను పిలిపించి వారిని విద్యార్థుల ఇళ్లకు పంపి వారి వివరాలు సేకరిస్తున్నారన్నారు. కేవలం అడ్మిషన్ల కోసం అధ్యాపకులను విద్యార్థుల ఇళ్లకు తిప్పడం సరికాదన్నారు. ఏలూరు పట్టణ కార్యదర్శి ఎల్.రాజేష్ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలు నాణ్యమైన, విలువలతో కూడిన విద్య అందించడంలో విఫలమవుతున్నాయన్నారు. విద్యార్థులను బట్టీ పట్టించడం తప్ప వేరే విద్యాప్రమాణాలు పాటించడం లేదని విమర్శించారు.

పెదవేగి ఆయిల్ పామ్ పరిశోధనాకేంద్రం డైరెక్టర్‌గా సురేష్

ప్రజాశక్తి - పెదవేగి

మండలకేంద్రమైన పెదవేగిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ ఫామ్ రీసెర్చ్ డైరెక్టర్‌గా డాక్టర్ కంచర్ల సురేష్ బాధ్యతలు చేపట్టారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన కంచర్ల సురేష్ మాట్లాడుతూ పెదవేగి ఆయిల్ పామ్ పరిశోధనా కేంద్రం పేరుప్రతిష్టతలు మరింత ఇనుమడింపచేసే విధంగా అధికారులు, సిబ్బంది శ్రద్ధతో పనిచేయాలన్నారు. సమన్వయంతో కలిసి పని చేయడం ద్వారా కార్యాలయం గౌరవాన్ని, ఆయిల్ పామ్ పరిశోధన, అభివృద్ధి రంగాల్లో సంస్థ ప్రతిష్టను పెంచేలా చూడాలన్నారు. కంచర్ల సురేష్ ఐసిఎఆర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్, సైంటిస్ట్ ఇన్‌ఛార్జి, ప్రాజెక్ట్ మోనటరింగ్, ఎవాల్యుయేషన్ సెల్‌లో కూడా సేవలందించారు. 60కి పైగా పరిశోధనా ప్రచురణలను ప్రచురించి ప్రపంచ ఖ్యాతి పొందిన శాస్త్రవేత్తగా గుర్తింపు పొందారు. దేశంలో ఆయిల్ పామ్ పరిశోధన, అభివృద్ధిలో వీరికి 26 సంవత్సరాల అనుభవం ఉంది.

చట్టాలను వినియోగించుకోండి

ఏలూరు: ప్రజలు చట్టాలను సద్వినియోగం చేసుకుని మంచి జీవనం సాగించాలని లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో రాజేశ్వరి వంగాయగూడెం సెంటర్‌లోని గంగానమ్మ నగర మున్సిపల్ పాఠశాల ప్రాంగణంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళలు, 16వ డివిజన్ పరిధిలోని సచివాలయ గ్రామ వాలంటీర్లు, ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతూ మానవుని మంచి మనుగడ కోసం అనేక చట్టాలు రూపొందించారని, ఈ చట్టాలను సక్రమమైన పద్ధతిలో వినియోగించుకోవాలన్నారు. స్త్రీల అభివృద్ధికి ఏర్పడిన చట్టాలను సక్రమమార్గంలో ఉపయోగించుకుని రక్షణ పొందాలని, అలాగే ఎవరికైనా ఏ విధమైన కుటుంబ వివాదాలుఉన్నా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. బాలబాలికలను తప్పనిసరిగా బడికి పంపించాలని, పిల్లలకు మంచి చదువులు నేర్పడం ద్వారా వారికి ఉజ్వల భవిష్యత్ ఏర్పడుతుందని తెలిపారు. పేదలకు ఉచిత న్యాయ సహాయం లీగల్ సర్వీసెస్ వారు అందిస్తారని తెలిపారు. వచ్చేనెల 11వ తేదీన నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో అన్ని రకాల సివిల్, కుటుంబ వివాదం, వాహన ప్రమాద బీమా కేసులు, చెక్ బౌన్స్ కేసులు, చిట్ ఫండ్ కేసులు రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులను పరిష్కరిస్తామని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని డబ్బు సమయాన్ని ఆదా చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జె.విజయనిర్మల పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాల నిరోధానికి నిఘా

ఉంగుటూరు: మండలంలో అక్రమ మట్టి తవ్వకాలను నిరోధించేందుకు, గ్రామస్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తహశీల్దారు కెవి.రమణరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ శాఖల గ్రామస్థాయి అధికారులతో ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలు మట్టి అక్రమ తవ్వకాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఇలాంటి తవ్వకాలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని కంసాలిగుంట, నల్లమాడు, గొల్లగూడెం గ్రామాల్లో పోలవరం కుడికాలువకు ఇరువైపులా ఉన్న మట్టి కట్టలను తవ్వుతున్నారని, దీనివల్ల ఆ ప్రాంతంలో వేసిన విద్యుత్ స్తంభాల చుట్టూ ఉన్న మట్టిని తీసుకెళ్లడం వల్ల అవి కూలిపోయేలా ఉన్నాయని వచ్చిన ఫిర్యాదుపై సంబంధిత ప్రాంతంలోని విద్యుత్ స్తంభాలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని గొల్లగూడెం ట్రాన్స్‌కో సహాయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ని కోరారు. మట్టి తవ్వకాలకు సంబంధించి కూడా పిఐపిఆర్ ఎంసి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు, సహాయ ఇంజినీర్‌కు లేఖ ద్వారా చర్యలు తీసుకోవాలని కోరారు.

పేదలకు అసైన్డ్ భూములు ఇవ్వడంలో..

అధికారుల నిర్లక్ష్యం దారుణం

ప్రజాశక్తి - ఏలూరు

పేదల అసైన్డ్, సీలింగ్, గయాళ భూములను తక్షణం వారికి అప్పగించాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం(వ్యకాస) ఆధ్వర్యాన వంటావార్పు, అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పేదలకు భూ పంపిణీ చేయాలని, కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేదల భూములు ఆక్రమించుకున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రభుత్వాన్ని, రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. ఈ పోరాటానికి ఎపి రైతు సంఘం సంపూర్ణ మద్దతు తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం పేదల ఓట్లతో గెలిచి, పేదలకు చెందిన భూములను అక్రమంగా అనుభవిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా తాత్సారం చేస్తూ వారికి ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. సంక్షేమ పథకాల పేరుతో పేదలను మభ్యపెడుతూ అసలైన భూ యజమానులకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దెందులూరు మండలం దోసపాడులో గత ఎనిమిది నెలలుగా దళితులు, పేదలు, పోరాటం చేస్తూ తమ భూములు తమకు ఇవ్వాలని మండల, జిల్లా రెవెన్యూ శాఖ అధికారులకు విన్నవించుకున్నప్పటికీ చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లుగానే అధికారులు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తహశీల్దార్ అవినీతికి పాల్పడుతూ పేదల భూములను పంపిణీ చేయకుండా భూ స్వాములకు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. 8 నెలల క్రితం సర్వే నిర్వహిస్తామని చెప్పి నేటికీ సర్వే నిర్వహించకపోగా చట్టాన్ని ధిక్కరిస్తూ చట్ట వ్యతిరేక పనులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. దళితుల, పేదల భూముల ఆక్రమించుకున్న వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టి కఠినంగా శిక్షించాలని చట్టం చెబుతున్నప్పటికీ దాన్ని పక్కనపెట్టి రెవెన్యూ శాఖ అధికారులే భూస్వాములకు వత్తాసు పలుకుతున్నారని ఏద్దేవా చేశారు. అసైన్డ్ చట్టం, సీలింగ్ చట్టం, కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను ప్రభుత్వం, రెవెన్యూ శాఖ అధికారులే అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. 1956 నుండి దఫదఫాలుగా ఎస్సైన్డ్, సీలింగ్ భూములు పేదలకు పంపిణీ చేశారని తెలిపారు. ఆ భూములను విజయవాడకు చెందిన సంపన్నులు దేవినేని బాజీప్రసాద్, తదితరులు బలవంతంగా ఆక్రమించి అనుభవిస్తున్నారన్నారు. చట్టవిరుద్ధంగా ఎసైన్డ్, సీలింగ్ భూముల్లో చేపలు, రొయ్యల చెరువులు తవ్వి అనుభవిస్తున్నా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

దోసపాడులో 1975కు ముందు అప్పటి ప్రభుత్వం పేదలందరికీ ఎసైన్డ్ చేసి పట్టాలిచ్చిందన్నారు. కానీ ఆ భూములను స్థానికేతర భూస్వాములు ఆక్రమించుకుని సాగు చేస్తున్నన్నారని, ఈ భూములు పేదలకు ఇప్పించాలని అన్ని కార్యాలయాల చుట్టూ తిరిగినప్పటికీ ఎలాంటి ప్రయోజనమూ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి లోకాయుక్తను ఆశ్రయించడంతో 2015లో ఈ భూములను ఎస్సైన్డ్‌దారులైన ఎస్‌సి పేదలకు అప్పగించాలని ఆదేశించినప్పటికీ న్యాయం జరగలేదన్నారు. 208, 213, 214, 216, 225, 226, 227, 231, 232 సర్వే నెంబర్లలో ఉన్న భూమిని ప్రభుత్వం ఎస్సైన్డ్ చేసి పేదలకు పంచిందన్నారు. కానీ నేటికీ ఈ భూమి స్థానికేతర భూస్వాముల చేతుల్లోనే ఉందని తెలిపారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పేదల భూములను ఆక్రమించుకుని అనుభవిస్తున్న వారిపై అట్రాసిటీ కేసు పెట్టి శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పి.ఆనందరావు, వెంకటరమణ, లాజర్ మణి, జాన్ రాజు, లక్ష్మీ, లలిత, నాగేంద్ర, మాణిక్యం, కుమారి, దేవకృప నాయకత్వం వహించారు.

సచివాలయ సిబ్బంది కుటుంబాలకు

కారుణ్య నియామకాలు : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

కారుణ్య నియామక పత్రం అందిస్తున్న కలెక్టర్

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు విధినిర్వహణలో మరణించిన కుటుంబాలకు కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సర్వీసు క్రమబద్ధీకరణ, కారుణ్యనియామకాలు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తూ మృతిచెందిన ఉద్యోగ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల్లో చేయాల్సిన 26 మందికి సంబంధించి వారి కుటుంబ సభ్యుల అర్హతలను బట్టి ఉద్యోగాల నియామకానికి సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామ, సచివాలయాల్లో సర్వీసు క్రమబద్ధీకరణలో భాగంగా 633 మంది ఉన్నారని వారి సర్వీసు క్రమబద్ధీకరణకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ వెలువడుతున్న దృష్ట్యా సంబంధిత శాఖల అధికారులు సంబంధిత పోస్టుల ఖాళీలను రోస్టర్ పాయింట్‌ల వారీగా జాబితాలను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తూ వారందాటిన సెలవులు అనంతరం విధులకు హాజరు కాని వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. అప్పటికీ స్పందించకపోతే వారి నుండి రాజీనామా కోరడం కానీ, విధుల నుంచి తొలగించడం చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, జెడ్పి సిఇఒ కె.రవికుమార్, డిపిఒ మల్లికార్జున్, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రభాస్కరరెడ్డి, డిఎంహెచ్ఒ నాగేశ్వరరావు, పశుసంవర్థక శాఖ జెడి జి.నెహ్రూబాబు, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదనరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై.రామకృష్ణ, ఉద్యానవనశాఖ డిడి పాండురంగ, సెరీకల్చర్ ఎడి డి.వాణి పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టండి

25న ఉపాధ్యాయ సంఘాలకు మద్దతుగా నిరసన - ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేపట్టాలని, లేనిపక్షంలో బుధవారం ఏలూరు విద్యాశాఖ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ సంఘాలకు మద్దతుగా ప్రత్యక్ష నిరసన చేపట్టనున్నట్లు ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న సర్‌ప్లస్ ఉపాధ్యాయులను సర్దుబాటులో భాగంగా సుదూర ప్రాంతాలకు బదిలీ చేస్తూ విద్యాశాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సర్‌ప్లస్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేపట్టారని, అయితే ఈ జిల్లాలో అందుకు భిన్నంగా ఉపాధ్యాయులను యథేచ్ఛగా సుదూర ప్రాంతాలకు బదిలీలు చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా మాదిరిగా పశ్చిమగోదావరి జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలు కూడా కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టాలని కోరినా ఎటువంటి ప్రయోజనమూ లేకుండాపోయింది. వెంటనే సమస్యను పరిష్కరించకపోతే బుధవారం ఉపాధ్యాయ సంఘాలకు మద్దతుగా ప్రత్యక్ష నిరసన చేపడతామని సాబ్జీ స్పష్టం చేశారు.

స్పందన అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వపరంగా ప్రజలకు అందిస్తున్న పథకాలకు సంబంధించిన సమస్యలపై స్పందనలో అందజేస్తున్న అర్జీలపై అధికారులు స్పష్టమైన, నాణ్యతమైన సమాచారాన్ని అందజేసి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎన్ఎస్.మూర్తి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జెడ్‌పి సిఇఒ ఆర్.రవికుమార్, ఆర్‌డిఒ కె.పెంచలకిషోర్‌తో కలిసి స్పందన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో ప్రజలు అందజేస్తున్న అర్జీలకు సంబంధిత అధికారులు సమాచారం ఇవ్వడంలో నాణ్యత పాటించాలని అధికారులను అదేశించారు. 214 అర్జీలు స్వీకరించామని వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

విఒఎల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

విఒఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు అధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కార్యదర్శి కొండలరావు మాట్లాడుతూ విఒఎల కాలపరిమితి మూడు సంవత్సరాల విధానాన్ని రద్దు చేయాలని, ఎబిసిడి కేటగిరి విధానాన్ని కూడా తొలగించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మూడు నెలల బకాయి వేతనాలను చెల్లించాలని ఎపిఎం రామారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జంగారెడ్డిగూడెం కార్యదర్శి సుభాషిణి, వెంకటలక్ష్మి, లక్ష్మి కుమారి పాల్గొన్నారు.

ఎపిఎంకు వినతిని అందిస్తున్న విఒఎలు

4, 5 తేదీల్లో హేలాపురి బాలోత్సవం

ప్రజాశక్తి - దెందులూరు

ఫిబ్రవరి 4, 5 తేదీల్లో ఏలూరు శాంతినగర్‌లోని సిఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్‌లో హేలాపురి బాలోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ దెందులూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు జి.జయకుమార్, టి.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు, పెదపాడు, పెదవేగి, దెందులూరు, భీమడోలు, ముసునూరు మండలాల్లోని సుమారు 570 ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు ఈ హేలాపురి బాలోత్సవంలో పాల్గొంటారని వారు పేర్కొన్నారు. ఈ మండలాల్లోని మూడో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరూ అర్హులని వారు తెలిపారు. ఫిబ్రవరి నాలుగో తేదీన ఉదయం తొమ్మిది గంటలకు జెండా ఆవిష్కరణతో బాలోత్సవం ప్రారంభం అవుతుందని, సుమారు 25 తరగతి గదుల్లో అకాడమిక్, కల్చరల్ అంశాల్లో ప్రతిభా, పాటవ ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ హేలాపురి బాలోత్సవ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులందరికీ ప్రశంసాపత్రాలు, 700 మంది విజేతలకు మెడల్స్, మెమొంటోలు అందించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు ఈ హేలాపురి బాలోత్సవంలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

వేంపాడు రైతుల ఆందోళన

ప్రజాశక్తి - నూజివీడు

మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ఉన్న శ్రీ రఘునాథ స్వామి ఆలయ పరిధిలోని వేంపాడు అగ్రహారం భూములను సాగు చేస్తున్న సన్న చిన్న కారు రైతులు రామదండు పేరిట సోమవారం ఆందోళన బాట పట్టారు. గొల్లపల్లి గ్రామంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వార్థపరులైన బడా భూస్వాములు, బినామీ రైతులకు అధికారులు కొమ్ము కాస్తున్నారన్నారు. స్థానికంగా ఉండి భూమిని నమ్ముకుని సాగు చేస్తున్న నిజమైన సన్న చిన్న కారు రైతాంగాన్ని అన్యాయం చేయడం దారుణమని రైతులు ఒకరు శ్రీరంగం, అంగిరేకుల గోపి వాపోతున్నారు. కేవలం పదిమంది బడా భూస్వాములు బినామీలు పేరిట ప్రభుత్వ భూమి ఉంటున్నారు. భూమిని నమ్ముకుని సాగు చేస్తున్న తమలాంటి సన్న చిన్న కారు రైతాంగానికి భూ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. రామదండుగా ఏర్పడి రైతులమంతా వచ్చి కార్యాలయాలకు తాళం వేశారన్నారు. తమ పోరాటం ఆగదని సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ కార్యాలయాల వరకు వెళ్లి అసలు నిజాలు తమ గోడు వెళ్లబోసుకుంటామని స్పష్టం చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. 1987-88 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా హైస్కూల్లో ఆత్మీయ కలయిక అనే కార్యక్రమం నిర్వహించారు. వివిధ వృత్తులు, వ్యాపారాలు, ఉద్యోగాల్లో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి ఆటపాటలతో సందడి చేశారు. వారంతా గత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. తమకు చదువులు చెప్పిన గురువులు చింతపల్లి మోహనరావు, గూడవల్లి వెంకటేశ్వరరావు, బొర్రా వరప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. ఈ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి కోడే చంటి ఆహారాలు, మాధవి ఆర్గనైజర్లుగా వ్యవహరించారు.

సీనరేజీ నగదు జమ చేయాలని వినతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

గనులు, భూగర్భ శాఖ ద్వారా తమ గ్రామానికి చెందిన ఆర్‌ఎస్ 2/1 గ్రావెల్ క్వారీకి సంబంధించిన సీనరేజీ నగదును పంచాయతీకి జమ చేసి అభివృద్ధికి సహకరించాలని తోటపల్లి గ్రామ పంచాయతీ సర్పంచి ఆరేపల్లి శ్రీవల్లి, మాజీ సర్పంచి ఆరేపల్లి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు అందించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు పొందిన క్వారీ నిర్వాహకులు మైన్స్ అండ్ జియాలజీ శాఖ వారికి రూ.3,45,40,515 రాయల్టీగా కట్టినట్లు తెలిపారు. అందులో సుమారుగా రూ.కోటి పంచాయతీకి సీనరేజీ కింద మైన్స్ అండ్ జియాలజీ శాఖ వారు చెల్లించాల్సి ఉందన్నారు. వాటిని చెల్లించకపోవడంతో పంచాయతీలో కనీస మౌలిక వసతులు కల్పించలేని దీనస్థితిలో ఉందని తెలిపారు. గ్రామ పంచాయతీలకు కేంద్రం నుంచి విడుదలయ్యే 14, 15వ ఆర్థిక సంఘం నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం తమ ఖజానాకు తరలించుకోవడంతో పంచాయతీల్లో కనీస మౌలిక వసతులు ఏర్పాటు చేయలేని పరిస్థితుల్లో ఉన్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

పలుచోట్ల 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - గణపవరం

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకు, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. మండలంలోని అప్పన్నపేటలో సోమవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందంజలో ఉంటుందన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ముదినేపల్లి : గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి మరోసారి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. ముదినేపల్లిలో మూడోరోజు సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు.

జాతరకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి - కైకలూరు

పెద్దింటి అమ్మవారి జాతర మహోత్సవాల పనులకు తన చేతులమీదుగా అంకురార్పణ నిర్వహించడం సంతోషంగా ఉందని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి ఆలయం వద్ద జాతర మహోత్సవాల నిర్వహణ పనులకు ప్రారంభ సూచకంగా పందిరిరాటను పాతారు. ఆలయ ఇఒ కందుల వేణుగోపాలరావుతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి పందిరిరాటను పాతారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డీల కార్పొరేషన్ చైర్ పర్సన్ సైదు గాయత్రి సంతోషి, ఎంపిపి అడివి వెంకట కృష్ణ మోహన్, జెడ్‌పిటిసి సభ్యులు కురేళ్ల బేబి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బాలికను వేధించిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రేమిస్తున్నానంటూ బాలిక వెంటపడి వేధిస్తోన్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగిరిపల్లికి చెందిన నలుకుర్తి రామకృష్ణ అలియాస్ చింటూ అదే గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికను ప్రేమిస్తున్నానంటూ పెళ్లి చేసుకుంటానని వేధిస్తున్నాడు. ఈ క్రమంలో రామకృష్ణ ఈ నెల 20వ తేదీన ఇంట్లోకి వచ్చి తన గొంతు పట్టుకుని అసభ్యకరంగా ప్రవర్తించడంతో, తాను కేకలు వేయటంతో అక్కడి నుంచి పారిపోయాడని బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు రామకృష్ణను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

రూ.3 లక్షల ఆస్తి నష్టం

కుక్కునూరు : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమై రూ.మూడు లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ఘటన మండలంలోని బంజరగూడెంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బంజరగూడెం గ్రామానికి చెందిన ముత్తినేని శేషు, మునేశ్వర దంపతులు వ్యవసాయ పనులకు వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. చుట్టుపక్కల వారు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని రూ.50 వేల నగదు, రూ.లక్ష విలువైన బంగారం, టీవీ, ఫ్రిజ్, మంచాలు, వంటపాత్రలు, బట్టలు రేషన్, ఆధార్ కార్డులు పూర్తిగా కాలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని, కట్టుబట్టలతో మిగిలామని బాధితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

భార్యను చంపిన భర్త అరెస్ట్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి గ్రామానికి చెందిన ఊర్ల శ్రీలత్‌పై భర్త కిర్తిపేటలో తలపై నరికి ఆమె చనిపోవడానికి కారణమైన భర్త ఊర్ల రామదాసును పోలీసులు అరెస్టు చేశారు. జీలుగుమిల్లి సిఐ బి.వెంకటేశ్వరరావు ఐపిసి సెక్షన్ 302 ప్రకారం నిందితునిపై కేసు నమోదు చేసి జీలుగుమిల్లిలో రామదాసును సోమవారం అరెస్టు చేశారు. జంగారెడ్డిగూడెం కోర్టులో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

16 నుంచి బలివే ఉత్సవాలు

ఏర్పాట్లపై నూజివీడు సబ్ కలెక్టర్ సమీక్ష

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాజేంద్రన్

ప్రజాశక్తి - ముసునూరు

బలివే గ్రామంలో ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. మండలంలోని బలివే గ్రామంలోని ఆలయం వద్ద వివిధ శాఖల అధికారులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాల్లో తమ్మిలేరులో పోలవరం నీళ్లతో పాటు జల్లు స్నానాలు ఏర్పాటు, రూ.25, రూ.100, రూ.200 దర్శనం టికెట్లతో పాటు విఐపి దర్శనం కోసం బారికేడ్ల ఏర్పాటు, తమ్మిలేరుపై తాత్కాలిక వంతెన నిర్మాణం చేయాలని సూచించారు. పంచాయతీ వారు నీరు సరఫరా చేయాలని, శానిటేషన్ పనులు చూడాలని చెప్పారు. వైద్య శాఖ వారు ఐదు రోజులు కూడా షిఫ్టులవారీగా వైద్య సేవలందించాలన్నారు. అక్రమ మద్యం అమ్మకాలు జరగకుండా చూడాలని ఎక్సైజ్ శాఖాధికారికి సూచించారు. గతంలో వలే ఆ ఐదురోజులు 24 గంటలు విద్యుత్ నిత్య సరఫరా చేస్తామని ఆ శాఖ అధికారులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చే నేపథ్యంలో రెండో రోడ్డును బాగు చేయించాలని సబ్ కలెక్టర్‌ని బలివే గ్రామ సర్పంచి ప్రవీణ్ సుధాకర్ కోరారు.

మండలంలో జరిగే అతిపెద్ద ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తారు. ఆర్‌అండ్‌బి రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. గతేడాది కూడా ఉత్సవాల సమయంలో రోడ్లకు మరమ్మతులు చేయలేదని, దీంతో ఆ గోతుల్లో పడి చాలా మంది గాయాలపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మార్జిన్లు బాగు చేయలేదని చెప్పారు. ఈ సారి అలా జరగకుండా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు. ఈ సమావేశంలో జిల్లా దేవాదాయ శాఖాధికారి చెన్ను రంగారావు, ఆలయ ఇఒ టి.విశ్వేశ్వరరావు, డిఎస్‌పి ఆశోక్‌కుమార్‌గౌడ్, సిఐ అంకబాబు, ఎస్ఐ ఎం.కుటంబరావు, ఎంపిడిఒ జి.రాణి, తహశీల్దార్ దాసరి సుధ, పెదవేగి తహశీల్దార్ నాగరాజు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పందన @ అర్జీలు జీరో

ప్రజాశక్తి - దెందులూరు

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పందన కార్యక్రమానికి దెందులూరు మండలంలో స్పందన లేదు. మండలంలో సుమారు 17 గ్రామ పంచాయతీలు ఉండగా సోమవారం దెందులూరు మండల తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమం ఫిర్యాదుదారులు లేక బోసిపోయింది. మండలంలోని ప్రతి గ్రామంలో ప్రధానమైన సమస్య జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణం. అయితే అవి పూర్తి కాకపోవటంతో మండల స్థాయి అధికారులతో పాటు జిల్లా స్థాయి అధికారులు సైతం నిత్యం పర్యవేక్షణలు చేస్తున్నప్పటికీ ఎటువంటి ఫలితం లభించటంలేదు. దీంతో అధికారులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మేజర్ పంచాయతీలతో పాటు మైనర్ పంచాయతీల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొనటంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. లబ్ధిదారులను ఎంపిక చేసి రెండున్నరేళ్లు అవుతున్నప్పటికీ ఇప్పటివరకూ కనీసం ఇళ్ల నిర్మాణం ఇంకా 50 శాతం కూడా పూర్తి కాలేదు. దీంతో పాటు మండలంలో పలు సమస్యలు ఎక్కడివి అక్కడనే పేరుకుపోయాయి. ముఖ్యంగా చెత్త సేకరణ, డంపింగ్ సమస్య మండలంలో ఎక్కువగానే ఉంది. వీటితో పాటు అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ స్పందనలో సోమవారం ఎటువంటి ఫిర్యాదు అందలేదని తహశీల్దార్ ఎన్‌వి.నాంచారయ్య తెలిపారు. మరోవైపు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్య చౌదరి గడప గడపకూ కార్యక్రమం ద్వారా స్థానిక సమస్యలపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను పరిష్కరించడంతో మండలంలో స్పందనకు ఫిర్యాదులు రావడంలేదని అధికార పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇంకోవైపు ప్రతిపక్షాలు ఫిర్యాదులు చేసినా పార్టీ ఫీలింగ్స్‌తో స్పందిస్తుండటం తో ప్రజలు ఫిర్యాదులు చేయడంలేదని చెబుతున్నారు.

సుభాష్ చంద్రబోస్ జీవితం.. యువతకు ఆదర్శం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్వాతంత్ర్య సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితం నేటి యువతకు ఆదర్శమని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు వాసా సత్యనారాయణ అన్నారు. సుభాష్‌చంద్రబోస్ 126వ జయంతిని పురస్కరించుకుని స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వినాయక చిట్ ఫండ్స్ మేనేజర్ కటకం బసవయ్య, జర్నలిస్టులు కె.వెంకట్, ఎన్.బాలసుబ్రహ్మణ్యం, విహెచ్‌పి ప్రతినిధులు కురగంటి శ్రీనివాస్, డి.నారాయణమూర్తి, వినాయక చిట్ ఫండ్స్ సిబ్బంది, సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక పంచాయతీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్వాతంత్రోద్యమ సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి ఎంపిటిసి సభ్యులు నీలి సుమన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు స్వీట్స్, బిస్కెట్ ప్యాకెట్లు అందించారు. కోట కలిదిండి ఎంపిటిసి సభ్యులు చాంద్ బాషా, ప్రధానోపాధ్యాయులు ప్రేమకుమారి, స్థానిక నాయకులు రాంబాబు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు పాల్గొన్నారు.

చింతలపూడి : దేశ స్వతంత్ర సమరయోధుల్లో సుభాష్ చంద్రబోస్ పోరాట పటిమ అద్వితీయమైందని చింతలపూడి బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు మాటూరి చక్రధరరావు అన్నారు. పట్టణంలో జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గణపవరం : గణపవరం డిగ్రీ కాలేజీలో సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ దేశ స్వతంత్రం కోసం సుభాష్ చంద్రబోస్ చేసిన పోరాటాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మధురాజు, లెక్చరర్లు డివి.చిన్నసత్యనారాయణ, జి.వెంకట్రావు, కె.స్వరూపరాణి, కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దెందులూరు : దేశభక్తికి, పట్టుదలకు, సాహసానికి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అందరికీ ఆదర్శమని కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎల్ఎన్‌విజి.శర్మ అన్నారు. కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత నేతాజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఉపాధ్యాయులు సత్యనారాయణ నేతాజీ బాల్యం, విద్యాభ్యాసం, ఉద్యోగం, చేపట్టిన పదవులను వివరించారు. ఉపాధ్యాయులు ఎం.నాగరాజు భారత జాతీయ సైన్యం, ఆజాద్ హింద్ ఫౌజ్, హిట్లర్‌ను కలవడం తదితర అంశాలను వివరించారు. ఫస్ట్ అసిస్టెంట్ భగవతీ దేవి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని లోపూడి గ్రామంలోని ఆశ్చర్య పాఠశాల ప్రిన్సిపల్ వరికూటి ప్రతాప్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ 12వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్ మాట్లాడుతూ బ్రిటిష్ వారిని గడగడలాడించిన తొలి సైనికుడు సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు.

ఏరియా ఆసుపత్రిలో వృద్ధుని బంధువులు

ఆ వృద్ధుడు అనాథ కాదు...

కాకినాడ తీసుకెళ్లిన బంధువులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మున్సిపల్ కార్మికులు శ్మశానవాటిక షెడ్డు వద్దకు చేర్చిన మతిస్థిమితం లేదని వృద్ధుడు అనాథ కాదు. ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుని బంధువులు సోమవారం అక్కడికి చేరుకున్నారు. వృద్ధుడిని శ్మశానవాటికి షెడ్డు వద్దకు తరలించిన నేపథ్యంలో ప్రచురించిన వార్తా కథనాలు, సోషల్ మీడియా ప్రచారం ఆ వృద్ధుడి పరిస్థితి బంధువులకు చేరవేశాయి. స్థానిక ఏరియా ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న మతిస్థిమితం లేని వృద్ధుడి వద్దకు సోమవారం అతని బంధువులు చేరుకున్నారు. కాకినాడకు చెందిన కోరుకొండ రామారావు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గత ఐదేళ్ల క్రితం మతి స్థిమితం కోల్పోయిన కోరుకొండ రామారావు చనిపోయి ఉంటాడని భావించిన బంధువులు ఆశలు వదులుకున్నారు. ఇటీవల జంగారెడ్డిగూడెం శ్మశాన వాటికకు చెత్త వాహనంలో వృద్ధుడిని తరలించిన వార్తల్లో ఫొటోలు చూసి గుర్తుపట్టిన బంధువులు స్థానిక ఏరియా ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. వృద్ధుడి తమ్ముడి కుమారుడు రాజకుమార్ కాకినాడలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. స్థానిక తహశీల్దార్ స్లీవజోజి సమక్షంలో కోరుకొండ రామారావును బంధువులు అంబులెన్స్‌లో కాకినాడకు తీసుకువెళ్లారు.

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

విద్యార్థులు ఇప్పటి నుంచే పోటీతత్వాన్ని అలవార్చుకుని మంచిగా చదవాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌బాబు సూచించారు. 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రహదారిపై నడిచేటప్పుడు మెలకువలు పాటించాలన్నారు. రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడపకూడదని చెప్పారు. అనంతరం పిల్లలకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ కృష్ణవేణి, ఉపాధ్యాయులు చంద్రావతి, అశోక్ పాల్గొన్నారు.

బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

భూ వివాదాల పరిష్కారానికి రీ సర్వే : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - కైకలూరు

భూ యాజమాన్య నిర్ధారణకు సమగ్ర భూ రీ సర్వే ద్వారా భూ వివాదాలను పరిష్కరించి, శాశ్వతహక్కు కల్పించవచ్చని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పెంచికలమర్రులో డ్రోన్ కెమెరాలతో జరిగే భూ రీ సర్వే కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో, అన్ని గ్రామాల్లో భూ సర్వే చేస్తున్నారని, గ్రామాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. మండలంలో రెండో విడత గ్రామాల్లో రీ సర్వే జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మురళీకృష్ణ, రాష్ట్ర వడ్డీలు కార్పొరేషన్ చైర్ పర్సన్ సైదు గాయత్రీ సంతోషి, ఎంపిపి అడివి వెంకట కృష్ణ మోహన్, జెడ్‌పిటిసి సభ్యులు కురేళ్ల బేబి, ఎంపిటిసి సభ్యులు బలే నరేష్, పెంచికలమర్రు సర్పంచి జయమంగళ కాసులు, మండల సర్వేయర్ ఫణి, డ్రోన్ టీం సర్వేయర్లు పాల్గొన్నారు.


భూ రీ సర్వే ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు0

ఘనంగా నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - దెందులూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలను దెందులూరు నియోజకవర్గంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సంతపేట సెంటర్‌లో, కొవ్వలి, పోతునూరు, గోపన్నపాలెం తదితర గ్రామాల్లో, పెదవేగి మండలంలోని పలు గ్రామాల్లో లోకేష్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ పేదలకు కేక్‌లు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కొంతమంది నాయకులు మంగళగిరి వెళ్లగా, మరి కొంతమంది నాయకులు ఏలూరు వెళ్లి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి దెందులూరు మండల అధ్యక్షులు మాగంటి నారాయణ వర ప్రసాద్(మిల్లు బాబు), టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పెనుబోయిన మహేష్, పార్టీ పెదవేగి మండల అధ్యక్షుడు బొప్పన సుధాకర్, టిడిపి జిల్లా కార్యదర్శి తాతా సత్యనారాయణ, దెందులూరు సర్పంచి తోట ఏసమ్మ, లక్ష్మీపురం సర్పంచి మేకా కనకరాజు, ఎంపిటిసి మాజీ సభ్యులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కైకలూరు : పట్టణంలోని వెలమపేట, ఎస్‌టి కాలనీ, ఆటపాకలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కేక్‌లు కట్ చేసి చిన్నారులకు పంచారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ, మాజీ శాసన మండలి సభ్యులు కమ్మిలి విఠల్‌రావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మి పాల్గొన్నారు.

చింతలపూడి : ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహించే యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలని ఐటిడిపి నియోజకవర్గ కన్వీనర్ బోడా అవినాష్, నత్తా నాగేంద్ర అన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలను చింతలపూడిలోని బట్టువారిగూడెం లిబర్టీ హోమ్ అనాథ శరణాలయంలోని పిల్లల మధ్య తెలుగు యువత చింతలపూడి టౌన్ అధ్యక్షులు నత్త రవి అధ్యక్షతన సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పిల్లల హర్షధ్వానాల మధ్య కేక్‌ను కట్ చేశారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి నగర పంచాయతీ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం, చింతలపూడి మండల ప్రధాన కార్యదర్శి కోండ్రు దేవా, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు పాల్గొన్నారు. స్థానిక అంజనేయస్వామి ఆలయం వద్ద మాజీ ఎంపి మాగంటి బాబు 108 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, నియోజకవర్గ నాయకులు సోంగా రోషన్‌కుమార్, తాళ్లూరి చంద్రశేఖర్‌రెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కోండ్రు దేవ పాల్గొన్నారు.

టి.నరసాపురం : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా మండలంలోని అప్పలరాజుగూడెంలో సోమవారం మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు 50 కుర్చీలు, మహిళల శ్రీమంతానికి ఐదు కుర్చీలు తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షులు గన్నిన సురేంద్రనాథ్ చౌదరి ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు చేతుల మీదుగా అంగన్‌వాడీ టీచర్స్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాయుడు రామకృష్ణారావు గౌడ్, జయవరపు శ్రీరామమూర్తి, శీలం వెంకటేశ్వరావు, ఆచంట సూర్యనారాయణ, కొండపల్లి రవి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలను టిడిపి పట్టణ, మండల నాయకుల, కార్యకర్తల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గురవాయిగూడెం పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామ అధ్యక్షులు చిటికెన శ్రీను అధ్యక్షతన కేక్ కట్ చేశారు. యువగళం పాదయాత్ర జయప్రదం చేయాలని కోరుతూ అశ్వారావుపేట ఎన్‌టిఆర్ విగ్రహం నుంచి గంగానమ్మ ఆలయం వరకు టిడిపి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేశారు. 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. స్థానిక వృద్ధాశ్రమానికి బియ్యం అందించారు.

ముసునూరులో...

ముసునూరు : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు ఆ పార్టీ నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు, టిడిపి మండల నాయకులు దేవినేని ధలరామ్, పార్టీ గ్రామ అధ్యక్షులు పి.వీరాంజనేయులు, కోండేటి బాబి, పాకనాటి సీతారామ్, తోట శ్రీనివాసరావు, నక్కా యోహాన్, గారపాటి నరిసింహరావు, ఆటో సాంబయ్య, నల్లిబోయిన రాంబాబు, రెడ్డి కృష్ణయ్య, లోపూడి కాంతారావు, మేదరమెట్ల సురేంద్ర పాల్గొన్నారు.

ముదినేపల్లి : నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు టిడిపి యువనేత కొడాలి వినోద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత వినోద్ ఇంటి వద్ద నుంచి ఎన్‌టిఆర్ విగ్రహం వరకు యువకులు పెద్దఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు శోభనాద్రిచౌదరి, మండల ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్, బొర్రా చలమయ్య, వి.నరసింహారావు, జగన్‌మోహనరావు, దావు నాగరాజు, కె.శేషుబాబు, యర్రా రాంబాబు పాల్గొన్నారు.

మాజీ సర్పంచి కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి - గణపవరం

జల్లి కాకినాడ మాజీ సర్పంచి ఇందుకూరి జానకిరామరాజు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు సోమవారం జల్లి కాకినాడ వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానకిరామరాజు సర్పంచిగా గ్రామ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. గ్రామ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరన్నారు. జానకిరామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జానకిరామరాజు కుమారులు ఇందుకూరి అశోక చక్రవర్తి వర్మ, టిడిపి మండల అధ్యక్షులు ఇందుకూరి రామకృష్ణంరాజు, పార్టీ మండల నాయకులు సుబ్బారావు పాల్గొన్నారు

'టిడిపి బలోపేతానికి కృషి చేయాలి'

ప్రజాశక్తి - నూజివీడు

నియోజకవర్గస్థాయిలో టిడిపి బలోపేతానికి కృషి చేయాలని నియోజకవర్గ పరిశీలకులు బోడ్డు వేణుగోపాలరావు, టిడిపి మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్లు, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు. నియోజకవర్గ స్థాయిలో పార్టీని బలోపేతం చేసే దిశగా సభ్యత్వాలు, ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. ఓటర్ వెరిఫికేషన్‌లో నూజివీడు నియోజకవర్గం 50వ స్థానంలో ఉందని, మొదటి పది స్థానాల్లో నిలిపేందుకు క్లస్టర్ ఇన్‌ఛార్జులు కృషి చేయాలని చెప్పారు. నారా లోకేష్ ఆధ్వర్యంలో చేపట్టనున్న యువగళం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నియోజకవర్గ స్థాయిలో ప్రతి టిడిపి కార్యకర్త చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షులు ముసునూరు రాజా, పట్టణ అధ్యక్షులు మలిశెట్టి జగదీష్, ఎస్‌సి సెల్ నియోజవర్గ అధ్యక్షులు అరికోటి సంగతరావు పాల్గొన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెదగొన్నూరు ఇమ్మానుయేలు చర్చి పాస్టర్ ఉచ్చుల స్వర్జన్‌రాజు ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులకు, పేదలకు చీరలు పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు శ్రవణం పూర్ణచంద్రరరావు, బత్తుల ప్రసాద్ చేతులు మీదుగా 30 మంది వృద్ధులకు చీరలు అందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా వృద్ధులకు చీరలు పంపిణీ చేయడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఉచ్చుల విజయకుమార్, తాడంకి డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

బాబూరావుకు పరామర్శ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలో శనివారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావుకు వ్యతిరేకంగా వైసిపి మద్దతుదారులు గోబ్యాక్ దూలం నాగేశ్వరరావు అంటూ బ్యానర్ కట్టినందుకు పోలీసులు రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు శేవా నాగజగన్‌బాబూరావును, మాదిగ దండోరా జిల్లా అధ్యక్షులు ఏసుపోగు దానియేలును అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధం చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం పలువురు నేతలు బాబూరావును, దానియేలును పరామర్శించారు. ఈ సందర్భంగా వైసిపి రాష్ట్ర బిసి నాయకులు పోసిన పాపారావుగౌడ్ మాట్లాడుతూ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ఎస్‌సి కులాల నాయకులను అరెస్ట్ చేసి వారిపై కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. పరామర్శించిన వారిలో బిసి నాయకులు తిరువీదుల శారద, ఎలవర్తి భవాని, పూర్ణచంద్రరావు, శ్రీను ఉన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అర్హత కలిగిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని తహశీల్దార్ కె.స్లివజోజి విద్యార్థులకు సూచించారు. జనవరి 25వ తేదీన 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక డిగ్రీ కళాశాలలో సోమవారం పట్టణంలోని ఆరు డిగ్రీ కళాశాలల విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన వృక్తత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహశీల్దార్ మాట్లాడుతూ ఓటు భారత పౌరుని చేతిలో ఆయుధం వంటిదన్నారు. హక్కు పొందడమే కాకుండా ఎన్నికల సమయంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి జనవరి 25 జాతీయ ఓటర్ల దినోత్సవం రోజున బహుమతులు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్ బాబు, సామాజిక కార్యకర్త కెఎల్ఎన్.ధనకుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

Before the motor accidents claims tribunal-cum-xvi additional district judge court at Nandigama NTR district,a.p.
Mvop no 11/2020

Between
Dasu Prabhakar rao and other ... Petitioners
And
1.kunsoth venkateswarao ...R1
2. Ragolu Naga Raju ...R2..Respondents
To,
R2 Ragolu Naga Raju, S/o Dallaiah, 33years, Car Mechanic & owner of motor cycle AP04BE2226 R/o,Jangareddygudem (Town & Mandal),West Godavari district. A.P. Owner of motor cycle AP04BE2226.

Please take notice that the above name petitioners got field. The above petition MVOP 11/2019 for compensation. Against you and another and same stands posted to 2-2-2023 for your appearance there. For you here by directed by this notice to attend. Before this court as the said date at 10.30 am. Either in person or through your advocate, to answer the claim. Else the matter will be decided in your absence.

(By order of the court)
Sd/-
Bondalapati ramakrishna,
BSc,LLB,
Advocate, Nandigama.